
కథ

# సిరలు-ధమనులు

## పులికంటి కృష్ణారెడ్డి




**ఏదైతే ఈ జీవితంలో జరగకూడదని దృఢంగా నిర్ణయించుకున్నానో అదే జరిగిపోయింది. నిర్ణయం నిర్ణయంగా నిలబడడం నిలబడకపోవడం పరిస్థితుల మీద ఆధారపడుతుంది కానీ, మన చేతుల్లో లేదని ఈ సంఘటన నిరూపించింది. ఇది ప్రతి మనిషి జీవితంలో అనుభవానికొచ్చే వాస్తవమే!**

నేనూ నా జీవితంలో ఎదురైన అనుభవాల ప్రభావానికి లోబడి ఒక నిర్ణయం తీసుకున్నాను జీవితంలో వాడి ముఖమే చూడకూడదని!

ముఖం చూడటం కాదు, ఇప్పుడు ఎదురైన పరిస్థితి నేను కలలో కూడా ఊహించనిది. అది చెదలు- చెట్టు లోలోపలే చేరి తొలిచినట్టుగా నా గుండెల్ని తొలుస్తోంది. ముళ్లమీద కూర్చున్నట్లుంది. అసహ్యం నురగలు నురగలుగా లేచి కనురెప్పల ఒడ్డుల్ని బలంగా తాకి తోక ముడుచుకుంటూంది. అనూహ్యమైన ప్రకంపనల తాకిడికి తట్టుకోక ఆ సీట్లో కదిలీ మెదలకుండా జీవచ్ఛవమే అయ్యాను.

ఆ రోజు ఉదయం నిద్ర కనురెప్పల కౌగిలిలో, అచ్చనకాయలాడుతుంటే ఆ సుఖాన్ని అనుభవిస్తూ పడక మీద దొర్లుతున్నాను.

షరా మామూలే కదా? "ఈ కొంపలో వేళకింత తిని వేళకు పడుకునేది ఈ జన్మలో కుదరని పని!" అన్న పల్లవిలో ప్రారంభమైన మా శ్రీమతిగారి సుప్రభాత గీతం లీలగా చెవిన పడుతూ ఉంది.

ఆమె గొణుగుడు గీతానికి అపశ్రుతి పలుకుతున్నట్లుగా పల్లె నుండి కబురు.. పాలోడు

పోయాడట! ఒకప్పుడు 'పోయాడు' అన్న మాట చెవిని పడ్డే చాలు, కొంపలు మునిగినట్టు గుండె గభీమనేది.. ఆ గుండె ముక్కలుముక్కలుగ తెగి పడినట్లు ఒళ్లు కంపించేది. కళ్లు చెమ్మగిల్లేవి. మరి ఇప్పుడో? వయస్సు తెచ్చిన మార్పు ప్రభావమో, లేదూ ... అనుభవాలు నేర్పిన వేదాంత పాఠాలతో మనసు మాయాజాలం నుంచి బయటపడిందో? చెప్పలేను కానీ, అది ఎవడికైనా తప్పదు కదా? అని ఒక నిట్టూర్పు. ఆ నిట్టూర్పుతో కలిసి పాలోడికి పిడికెడు మట్టేయ్యాలి అన్న బాధ్యత! ఆ మట్టితో వాడి ఆత్మకు శాంతి కలుగుతుందో లేదో చెప్పలేను కానీ, "పాలోడికి పిడికెడు మట్టేసేదానిగ్గూడా నోచుకో లేకపోయినాడే?" అన్న అపవాదు మాత్రం తప్పుతుంది! అందుకైనా వెరచి బయలుదేరాలి!

నడకమీద నుండి పైకి లేచాను.. కాలకృత్యాలు తీర్చుకున్నాను. బస్టాండ్‌కు బయలుదేరాను. ఆ ముందురోజు చుట్టపు చూపుగా వచ్చి పలకరించిపోయిన వాన చినుకులు. రోడ్డు రొచ్చురొచ్చుగా ఉంది. కాలు తీసి కాలు వేయాలంటే అసహ్యంగా ఉంది. తల వంచి జాగ్రత్తగా అడుగు తీసి అడుగు వేస్తున్నాను. చిత్రంగా నా దృష్టి నడకమీద పడింది.

నడకలో ఒకేసారి ఎప్పుడూ రెండు కాళ్లూ ముందుండవు. వెనుకా ఉండవు. పైకెత్తిన ముందు కాలికి, వెనుక కాలు ఆధారం. అది శాశ్వతమైన అభయం. ఆ ఆధారం జారిపోతే? ఆ అభయం భయంగా మిగిలితే? జీవిత ప్రయాణమే కుంటుపడుతుంది. హుఁ... మానవ సంబంధాల్లో ఇది ఒక అంతుచిక్కని విచిత్రమైన అనుబంధం!

పోయిన పాలోడు మళ్లీ మనసులో మెదిలాడు. నిట్టూరుస్తూ బస్టాండ్ కొక ప్రదక్షిణం చేసి మా పల్లెకు వెళ్లే బస్సును వెదకి పట్టి దాని ముందు నిలబడి మూతిలోకి తొంగిచూసి అదే అని నిర్ధారించుకుని 'హమ్మయ్య!' అని ఊపిరి పీల్చుకుని బస్సుతట్టు చూశాను. గుండెల్లో రాయి పడింది. మనిషిని కాదు కనీసం గాలినికూడా చొరనివ్వమంటూ సవాలు చేస్తూ జనం. ఆ బస్సు తప్పితే ఆ మార్గంలో మరొక బస్సు లేదు. అందుకే కొందరు ఎండను కూడా లెక్కచేయకుండా పోయినవాడికి పిడికెడు మట్టేసే ప్రహసనంలో బస్సుపైకెక్కి, కూర్చుంటున్నారు!

ఆ బస్సులో జొరబడడానికి వీల్లేదు. అది తప్పితే పాలోడికి పిడికెడు మట్టేసే అవకాశమే లేదు. ఏం చేయాల? ఏమీ తోచకుండా దిక్కులు చూస్తూంటే "సార్! సార్!" అన్న పిలుపు నా చెవిన పడింది.

అది బస్టాండ్! ఎవరు ఎవరిని పిలుస్తున్నారో?

....నడకలో ఒకేసారి ఎప్పుడూ రెండు కాళ్లూ ముందుండవు. వెనుకా ఉండవు. పైకెత్తిన ముందు కాలికి, వెనుక కాలు ఆధారం. అది శాశ్వతమైన అభయం. ఆ ఆధారం జారిపోతే? ఆ అభయం భయంగా మిగిలితే?....



అని నా లోకంలో నేనుంటే "సార్... సార్! ... మిమ్మల్నే సార్!" అంటూ నన్నే పిలుస్తున్నాడు బస్సులో నిలబడి ఒక అబ్బాయి. ఆ అబ్బాయి ఎవరో నాకు తెలియదు. ఎప్పుడూ చూసినట్లు కూడా గుర్తు లేదు. అయినా పిలుస్తున్నాడు. ఆ పిలుపులో ప్రీతి ఉంది. ఆ చూపుల్లో అభ్యర్థన ఉంది. నాలో స్వార్థం ప్రోత్సహిస్తూ ఉంది. అభిమన్యుణ్ణి గుర్తుకు తెచ్చుకుంటూ ఆ పద్మవ్యూహాన్ని ముప్పతిప్పలు పడి ఛేదించాను.

"మీరు పెద్దోళ్లు... నా సీట్లో కూర్చోండి, నేను నిలబడతాను!" అంటూ ఆ అబ్బాయి తన సీటు చూపించాడు.

ఆ సీటువైపు చూశాను. ఒక దిగ్భ్రాంతి అసహ్యంగా మారి గుండె అట్టడుగు పొరల్లో నుండి తెరలు తెరలుగా పైకి లేచి సాచి ఒక్క దెబ్బ చెంపమీద కొట్టినట్లయింది. తల తిరిగింది. ఉక్కపోస్తున్నా వెన్నెముకలో చలి పుట్టింది. నోరు తడారిపోయింది!

ఏం చేయాలి? ఈ జన్మలో ఎవడి మొహమైతే చూడకూడదనుకున్నానో వాడి పక్కనే కూర్చుని గంటన్నరపైగా ప్రయాణం చేయాలి! ఆ మాట తలుచుకుంటే ఒళ్లంతా తేళ్లూ జెర్రెలూ పాకినట్లుంది. పాలోడికి పిడికెడు మట్టెయ్యకపోతే పీడ విరగడయింది. బస్సులో నుండి ఒక్కసారిగా ఎగిరి కిందికి దూకి బయటపడాలన్న ఆవేశం. ఆ ఆవేశాన్ని ఏ పరిస్థితుల్లోనూ ఆచరణలో పెట్టలేని నిస్సహాయత. 'ఎంత ఇరకాటంలో పెట్టావు బాబూ?' అన్నట్లుగా ఆ అబ్బాయివైపు చూశాను.

పెదాలపై చిరునవ్వుల పూలు పూయిస్తూ, 'కూర్చోండి, సార్!' అంటూ చూపులతోనే అభ్యర్థిస్తున్నాడు. కూర్చోలేను. నా మొండితనంతో ఆ అబ్బాయి లేత మొహంలో వెండిపూతగా మెరుస్తున్న ఆనందాన్ని తుడిచిపారేయలేను. నా తటపటాయింపును గమనించాడు. జేబులో నుండి చేతి రుమాలును తీసుకుని వంగి సీటు శుభ్రం చేస్తున్నాడు కాదు, నా గుండెను అలుముకున్న మురికిని తుడుస్తున్నాడు!

అభిమానం కట్టలు తెంచుకుంటే మనిషి ప్రవర్తన ఆ వెల్లువలో ఎలా కొట్టుకునిపోతుందో ఊహించలేము. కన్నులు చెమ్మగిల్లాయి. తటాలున వంగి ఆ పిల్లవాడి చేయి పట్టుకున్నాను. ఆ అబ్బాయి నా మొహాన్ని తదేకంగా చూస్తూంటే నేను ముళ్లసీటుపై కూర్చున్నాను. బస్సు ఎక్కేటప్పుడు అభిమన్యుడు గుర్తుకొస్తే ఇప్పుడు వసుదేవుడు!

బస్సు కదిలింది.

నా పక్కన కూర్చున్నదీ మా పాలోడే...! వాడూ పాలోడికి పిడికెడు మట్టెయ్యడానికే వస్తున్నాడు. జీవితంలో ఎప్పుడో కృతజ్ఞత నోట పిడికెడు మట్టేసింది చాలకుండా! అసహనం, అసహ్యం ఒకదానితో ఒకటి పెనవేసుకుని మనసునే కాదు, శరీరాన్ని కూడా కుంచింపచేశాయి. అయినా సందేహం. బస్సు కుదుపుల్లో తగిలే అవకాశం ఉంటుందని బాగా ఒదిగి కూర్చున్నాను. తానుమాత్రం అన్నిటికీ అతీతుడుగా కిటికీ పక్కన కూర్చుని శూన్యంలో దేన్నో వెతుకుతున్నాడు.

బస్సు వేగాన్ని పుంజుకుంది. నా నిస్సహాయ స్థితిని ఎగతాళి చేస్తున్నట్లుగా ఎగిరి పడుతోంది. చుట్టూ తెరలు దించినట్లుగా జనం. ఎటూ చూడలేని పరిస్థితి. చీకటిని లోపలికి ఆహ్వానిస్తూ కనురెప్పల



కొత్తగా కాపురం ప్రారంభించిన ఆండాళ్ మొదటిసారి వంటచేసి భర్తకు పెట్టింది.

అతను మొదటిముద్ద నోట్లో పెట్టుకోగానే, "రోజూ నే నిలాగే వంటచేస్తే నా కేమిస్తారు?" గోముగా అడిగింది.

"విడాకులు!" నోటిముద్ద కక్కేస్తూ చెప్పాడా భర్త.

- కలపర్తి సత్యం, ఏలూరు

తలుపుల్ని బిగించాను. అయితే మనోనేత్రం తెరుచుకుంది.

ఆ చీకటిలో ఒక ఎత్తయిన కొండ. ఆ కొండమీద ఒక బండ. ఆ బండలో ఒక దోన. ఆ దోనపక్కన కూర్చుని ఇద్దరు పిల్లోళ్లు. వాళ్లకు పదిహేను సంవత్సరాలు దాటలేదనడానికి ఆ కొండకోన కొమ్ముమీద నిలబడిన సూర్యుడే సాక్షి. ఆ ఇద్దరి అరచేతుల్లో ఒక్కొక్క ముద్ద సంకటి. ఆ సంకటి బాగా ఎండిపోయింది. ఎండిపోయిన సంకటిని పైపైనే చీనీపండుకు తోలు వొలిచినట్లు వొలిచారు. అంతకన్నా ఒక చుట్టు ఎక్కువగా ఎండిపోయిన శెనక్కాయ ఊరుబిండి. ఆ చారడు ఊరుబిండిని చెరినగం పంచుకున్నారు. సంకటి ముద్దను తుంచితుంచి ఊరుబిండి అద్దుకుని పెద్దోడు నంజినంజి తింటే చిన్నోడు ఆవురావురమని తిన్నారు. ఎండిపోయిన సంకటిని మింగడంలో ఎక్కిళ్లపై ఎక్కిళ్లు! నీళ్లు తాగాలి. సొరకాయ బుర్రలో తెచ్చుకున్న నీళ్లు. ఆవుల వేళనుండి పొద్దు నడిమిట్టకొచ్చేదాకా ఆ అడవిలో ఆవులవెంటపడి తిరుగుతూ దప్పికైనప్పుడు తాగడానికే సరిపోయాయి. నీళ్లు తాగక తప్పదు. నీళ్లున్నాయి. అయితే ఎక్కడ? బండమీద పాచికట్టిన దొనలో! ఆ నీళ్లల్లో పురుగులు జలజల తేలుతున్నాయి. అయినా పైగుడ్డ తీసి నీళ్లమీద వేసి దొనలోకి వొంగి కుడితిలో మూతిపెట్టి గొడ్డు నీళ్లు తాగినట్టు ఆ గుడ్డగుండా నీళ్లు నోట్లోకి పీల్చుకుని తాగుతున్నారు!

ఒళ్లు జలదరించింది. ఈ లోకంలో పడ్డాను. బస్సులో జనం. ఎవరి లోకం వాళ్లదిగా ... ఎవరి మాటలు వాళ్లవిగా! బస్సు పోతూనే ఉంది. పెదవులు పిడచకట్టాయి. చంక సంచిలో ప్లాస్టిక్ బాటిల్లో నీళ్లు. రెండు గుక్కలు తాగాను. మనసు కుదుటపడింది. నాకు తెలియకనే కన్నులు మళ్లీ మూతపడ్డాయి.


మూతపడిన కంళ్లముందు మళ్లీ ఆ కొండ. ఆ కొండల్లో కోనల్లో ఆ ఇద్దరు పిల్లోళ్లు ఆవులు మేపుతూ. అది కాకులు దూరని కారడవి. ఆ అడవిలో చిరుతలు రావచ్చు. పెద్ద నక్కలు రావచ్చు. ఆవులమీద పడచ్చు. పడ్తే ఆ పిల్లోళ్లు ఏం చేస్తారు? ఏమీ చేయలేరని ఆవులకూ తెలుసు. ఆ ఆవుల్ని మేపడానికి వాళ్లను అడవికి పంపిన పెద్దోళ్లకూ తెలుసు. అయినా ఆవుల వెంటపడి ఎవరో ఒకరున్నారన్న తృప్తి. అలవాటు పడిన గొడ్లు ఎలా అడివికి వెళ్తాయో అలానే ఇంటికి తిరిగి వస్తాయన్న నమ్మకం!

ఆ పూట పొద్దు గూట్లో పడింది. ఆవులు ఇల్లు చేరాయి. ఆ ఇద్దరు పిల్లోళ్లూ ఇల్లు చేరారు. ఆవులన్నీ ఒక కొట్టంలో చేర్తే ఇద్దరు పిల్లోళ్లూ చెరొక ఇల్లు చేరారు.

ఆ ఇద్దరిలో చిన్నోడికి ఆవుల మేపడమే పని. ఆ పూట వాడి పని వాడు చేశాడు. ఆ తృప్తితో ఇంట్లో పెట్టింది తిన్నాడు. హాయిగా కొట్టంలో పడుకుని నిద్రపోతున్నాడు ఆవులతో పోటీపడుతూ. వాడికంటే రెండేళ్లు పెద్దోడు. చిన్నోడికి వేలు విడిచిన అన్న. అపూటంతా అడవిలో ఆవులవెంటపడి తిరిగాడు. పొద్దుతో కూడా ఇంటికొచ్చాడు. అమ్మ ఆత్మీయంగా తల నిమురుతూ, "మొకమంతా ఇట్టా ఈడ్సుకోని పొయ్యిందాదే! మద్దేణం కాడ బువ్వ గ్గూడా రాకుండా యాడేడ తిరిగినావురా నాయినా?" అంటా ఆప్యాయతను రంగరించి పెట్టిన బువ్వ తిన్నాడు. పడుకున్నాడు. అడవుల్లో తిరగడం అలవాటు లేని పని. బాగా అలిసిపోయాడు. ఒళ్లు మరచి నిద్రపోవలసిన స్థితి. కన్ను పొడుచుకున్నా కంటిమీద రెప్ప పడలేదు!

కంటిమీద ఆ అడవి తన వికృత స్వరూపాన్ని ప్రదర్శిస్తూ ఉంది.

దట్టంగా అల్లుకున్న పడిగపొదలు ... చీకిపొదలు ... తలా తోకా లేకుండా పెరిగిన ముండ్లకంపలు ... పాపుగా పెరిగి దెయ్యంపట్టినట్లు గాలికి తలలూపుతూ చిత్రమైన శబ్దాలు చేస్తూ చెట్లు ... పెద్దపెద్ద బండలు ... గుండ్లు ... నేల కడుపును చీల్చుకుని కత్తుల్లా పైకి లేచిన కనికి రాళ్లూ ఆ అడవి అడుగడుగునా భయాన్ని కడుపులో దాచుకున్న ఒక పెద్ద నుడిగుండం. ఆ నుడిగుండంలో ప్రతినిత్యం ఎదురీదడమే చిన్నోడి జీవిత గమ్యం!




"నీ దగ్గర తొమ్మిది గేదెలు ఉన్నాయి. నేను ఇంకో తొమ్మిది గేదెలు ఇస్తే ఏమవుతుంది?" అడిగాడు లెక్కల మాస్టరు ఓ విద్యార్థిని.

"చదువు మానేసి గేదెలు కాయాల్సివస్తుంది."

- కలపర్తి సత్యం, ఏలూరు

ఇంతేనా చిన్నోడి జీవితం? ఇలా సాగిపోవాల్సిందేనా? ఎందుకిలా జరిగింది? ఆ రోజుల్లో ఎలిమెంటరీ స్కూల్ లీవింగ్ సర్టిఫికెట్ సాధించుకోవడంలో ఒకటికి రెండుసార్లు తప్పాడు కాబట్టి. అదే సాధించి ఉపాధ్యాయ శిక్షణ పొంది ఉంటే ఏ ప్రాథమిక పాఠశాలలోనో ఉపాధ్యాయుడుగా బతికుండవచ్చు. అది సాధ్యపడలేదు కాబట్టే

"నీకు చదువూ రాదు చట్టుబండలూ రావు! ఇంక నువ్వు సదిగింది చాలు గానీ, ఆవుగొడ్లయినా మేపుకోరా అబ్బోడా!" అన్నారు పెద్దోళ్లు.

ఆ మాట వాడి అసమర్థతమీద ఎక్కుపెట్టిన బాణం! ఆ దెబ్బతో తల వంచాడు. పలకా, పుస్తకాలూ అటకమీద కెక్కించి సంకటి చిక్కం చంకకు తగిలించుకున్నాడు. అడుగుకొక్క ఆపద కడుపులో దాచుకున్న అడవిలో ఆవుల వెంటపడ్డాడు. హుఁ కాలగమనంలో వాడికి కురుకురు మీసం వస్తుంది. చిక్కం వాడికంటే చిన్నోడికి. వీడి చేతికి పారా పలుగు. మట్టితో పోరాడుతూ ఒకనాటికి మట్టితో కలిసిపోవాల్సిందేనా?

నా వొళ్లు గగుర్పొడిచింది!

వేలు విడిచి పుట్టినంత మాత్రాన వాడికీ, నాకూ మధ్య ఇంత వ్యత్యాసమా? ఈ వ్యత్యాసాన్ని పూడ్చలేమా? అని ఆలోచిస్తూ ఆలోచిస్తూ నిద్రలోకి జారుకున్నాను.

తెల్లారింది. నా ఆలోచన తిరుగులేని ప్రయత్నంగా మారింది!

వేసవి సెలవుల్లో పల్లెలో ఉన్నాను కదా? పగటి పూట అడవిలో చెట్లక్రింద, రాత్రుల్లు ఊళ్లోని ప్రాథమిక పాఠశాలలో వాడు తప్పిన ఒకే ఒక సబ్జెక్ట్ లెక్కలు నేర్పించడానికి పూనుకున్నాను. చెప్పింది అర్థం చేసుకోలేక చెంపదెబ్బలు తిన్నాడు. కాలి తన్నులు తిన్నాడు. ఏమైతేనేం? నా ప్రయత్నం మట్టికొట్టకుండా వాడు పరీక్షలో కృతార్థుడయ్యాడు. అంటే ఉపాధ్యాయ శిక్షణ పొందడానికి అర్హత సంపాదించుకున్నాడు. ఆ ప్రయత్నంలో పడ్డాను. అప్పుడే ఒక ధార్మిక సంస్థ 'ఎనిమిదవ తరగతిలో కృతార్థులైన విద్యార్థులు బి.విద్వాన్‌లో చేరుటకు అర్హులు. ఉచిత వసతి, భోజనవసతి కల్పిస్తాం!'

అంటూ ప్రకటించింది. అంతకంటే శుభవార్త ఏముంటుందని ప్రయత్నిస్తే ఆల కాపరి ప్రాచ్య కళాశాల విద్యార్థిగా మారాడు. ఆ దశలోనే నేను ఊహించని విధంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి నయ్యాను. నా వంతు సహాయం ... ఉపాధ్యాయుల సహృదయత- వాడు విద్వాన్ అనిపించుకున్నాడు!

ఆ మాట నా చెవిని పడ్డప్పుడు నాకేమనిపించిందంటే రెక్కలు గట్టుకొని వాడు ఆవులు మేపిన అడవిలో వాలి కనిపించిన ప్రతి చెట్టుకు, పుట్టకు, పిట్టకు గొంతెత్తి చెప్పాలన్నంత ఊపు వచ్చింది! రాదా మరి? రాళ్లల్లో ఒక రాయిగా మిగిలిపోవాల్సిన ఒక రాతిని చక్కని శిల్పంగా మలచి పదిమంది దృష్టిని ఆకర్షిస్తే...?

అంతకంటే అద్భుతం ఏమంటే ఏ ధార్మిక సంస్థ వాడు విద్యాన్ అనిపించుకోవడానికి దోహదం చేసిందో, అదే సంస్థ తన నిర్వహణలో కొనసాగుతున్న ఉన్నత పాఠశాలలో తెలుగు పండితునిగా నియమించింది!

ఒక ఆల కాపరి విద్యార్థుల భవిష్యత్తుకు కాపరిగా!

ఈ అద్భుతం నుండి బయటపడకముందే మరొక అద్భుతం! తాను విద్యాన్ శిక్షణ పొందుతున్న కాలంలో అదే పట్టణంలో తన మేనమామ ... మంచి స్థితిపరుడు. కానీ మేనల్లుణ్ణి గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. అయితే అదే మేనల్లుడే అదే ఊళ్లో ఒక ఉద్యోగి అయ్యేసరికి మేనమామ కన్నుపడింది. ఆ చూపుల్లోనుంచి తప్పించుకోలేక ఆ ఇంటికి అల్లుడై కూర్చున్నాడు! అల్లుడయ్యే వరకు నాకు తెలియనే తెలియదు.

అక్కడే నా అభిమానం దెబ్బతింది!

"సార్!"

ఆ పిలుపుతో నా ఆలోచన తెగిపోయింది. పిలుపు ఆ అబ్బాయిదే! అటు చూశాను.

"నాది నల్లవెంగనపల్లె. మా ఊరు సమీపిస్తూ ఉంది, వెళ్లొస్తాను సార్!" అంటూ రెండు చేతులూ జోడించాడు.

"నాయనా, నీ సహాయం...."

"తమబోటి గొప్పవాళ్లకు ఇది సహాయం కాదు, నాకు దొరికిన అదృష్టం!"

గుండె పులకరించి కన్దోయి కొలకుల్లో కన్నీటి ముత్యాల్ని పండించింది.

మరి కాసేపటికి ఆ అబ్బాయి దిగిపోయాడు.

ఇద్దరూ మనుషులే! మనిషికీ మనిషికీ మధ్య ఎంత వ్యత్యాసం?

తాను నాలుగు సంవత్సరాలు అదే ఊళ్లో

"మీరు పశ్చిమ గోదావరిలో పుట్టారా? తూర్పు గోదావరిలో పుట్టారా?"

"ఛీఛీ... గోదావరిలో పుట్టడానికి నేనేం చేపపిల్లలా కనిపిస్తున్నానా? కప్పపిల్లలా కనిపిస్తున్నానా?"

- కలపర్తి సత్యం, ఏలూరు



విద్యార్థిగా బతికాడు. హాస్టల్లో వాళ్లు పెట్టిన చాలీ చాలని తిండి తింటూ ... ముగ్గురు నలుగురు విద్యార్థులకు కలిసి ఇచ్చిన ఒకే ఒక్క గదిలో తల దాచుకుంటూ ... ఉన్న జత బట్టల్లో ఒకదాన్ని రాత్రి పూట ఉతికి ఆరేసుకుంటూ ఎలాగో బతకాలి కాబట్టి బతికాడు. ఆ దశలో మేనమామ ఒక్కపూట తన ఇంటికి పిలిచి కడుపు చూసి అంత కూడు పెట్టలేదు. కనీసం తన స్థితిగతులేమిటో విచారించలేదు. అంతెందుకు? వారానికొకసారి తల స్నానం చేయాలంటే ఊరి ముందర గుంతలచేనిలో చింతల బావి. ఆ బావిగట్టున పుట్టమట్టే శరణ్యం. ఆ గతి లేని స్థితిలో తన మీద రవ్వంత సానుభూతి చూపలేని మేనమామ గౌరవించింది ఎవర్ని? తన్ను గాదు, తన ఉద్యోగాన్ని!

ఆ ఉద్యోగం ఎలా వచ్చింది? తన బ్రతుకు ఒక అనూహ్యమైన మలుపు తిరగడానికి కారకుడెవరు? అది రక్తసంబంధమో? అభిమానమో, మానవతో ఏదైనా కావచ్చు. అందులో అంతర్లీనంగా ఉన్న త్యాగాన్ని గుర్తించలేకపోయాడు. పోతే పోనీ! అనవసరంగా అపవాదులు అంటగట్టడానికి పూనుకున్నాడు. ఎక్కడ ఏ సందర్భంలో అయినా ఎదురు పడ్తే మొహం చాటేస్తున్నాడు. అటువంటి సమయాల్లో గతం దృశ్యరూపాన్ని సంతరించుకుంటే నా మీద నాకే రోత పుడుతూంది.

చేసిన మేలు చెప్పుకోరాదంటారు. అది నిజమే. అది మనిషి లక్షణం కాదు. మంచి లక్షణం కూడా కాదు. కానీ ఎంత ఉదాత్తుడైనా సరే గతాన్ని తలపోసుకోవడంలో కొంతకు కొంత ఊరట!

విద్వాన్ కడపటి సంవత్సరం. పరీక్షకు ఫీజు కట్టాలట. ఉత్తరం రాశాడు. అదేమంత పెద్దమొత్తం కాదు. అయితే దాదాపు యాభై సంవత్సరాలకు ముందు అది చాలా పెద్దమొత్తమే! నా జీతమా? అంతకు రెట్టింపు మాత్రమే! అందులో సగం విధిగా తల్లిదండ్రులకు పంపాలి. మిగతా సగంలో నా బ్రతుకు గడవాలి. ఊరు కాని ఊరు. ఉద్యోగుల జీవితాలా? దాదాపు అన్నీ ఒక తానులో పంచలే! పరీక్ష ఫీజు. నాలుగు సంవత్సరాల కృషి ఫలితం చేతికందే తా నొక విద్యావేత్తగా గుర్తింపు పొందడానికి పెడుతున్న పరీక్ష నా కొక విషమ పరీక్షగా మిగిలింది. ఏం చేయాలి? ఏం చేశానో చెప్పుకోవడమెందుకు? పంపాను. ఒకవేళ నా నిస్సహాయత నా ప్రయత్నాలమీద దెబ్బతీసి ఉంటే?

ఉన్నట్లుండి ఒక్క కుదుపు!

ఎదురుగా వస్తున్న బస్సును తొలిగే ప్రయత్నంలో పల్లంలోకి దిగిన బస్సు పైకెక్కడానికి ముక్కుతూ మూలుగుతూ వెనక్కూ ముందుకూ ఊగుతోంది!

ఒక చేత్తో ఎదురుగా ఉన్న సీటు కమ్మీని పట్టుకోవడంతో సరిపోయింది కానీ లేకుంటే తలకు మంచి దెబ్బ తగిలేదే? అదేపక్కనున్న పాలోడు మాగన్నుగా నిద్రపోతున్నాడు కదా? ఆ కదుపుకు పోయి. ఎదుటి సీటు కమ్మీమీద పడ్డాడు. నుదురు చిట్లింది. బొటబొటా నెత్తురు కారుతోంది.

చివాలున పైకి లేచాను. జేబులో నుండి చేతి రుమాలు తీసుకున్నాను. పర్రుమని రెండుగా చింపి ముడేశాను. చంక సంచిలో ప్లాస్టిక్ బాటిల్‌లోని నీళ్లతో తడిపాను. రక్తం కారుతున్న గాయాన్ని తుడిచి కాసేపు అదిమిపట్టి కట్టు కడుతున్నాను.

వాడు నా మొహంలోకి అయోమయంగా చూస్తున్నాడు.

"మిద్దూరు!... మిద్దూరు! తొరతొరగా దిగండి!" అంటూ కండక్టర్ అరుస్తున్నాడు. మా పాలోణ్ణి సాగనంపే ప్రయత్నంలో భాగంగా ఊళ్లో పలకలు ... కొమ్ములు మాకు స్వాగతం పలుకుతూ ఉంటే!...

■